JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 12-07-2026
Medchal - Malkajgiri । Sunday 12-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 41
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 41 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com






## ప్రముఖ గాయని జానకమ్మ కన్నుమూత

- ఆమె మరణం 'పాట'కు తీరని లోటు
- 60 సంవత్సరాల పైన సినీ జీవితంలో దాదాపు 17 భాషల్లో 50,000 పైగా పాటలు
- ఉత్తమ గాయనిగా జాతీయ పురస్కారం 4 సార్లు

**జయభేరి, హైదరాబాద్ :**

టాలీవుడ్ ఇండస్ట్రీ తీవ్ర విషాదం చోటు చేసుకుంది. లెజండరీ సింగర్ ఎస్ జానకి కన్నుమూశారు. టాలీవుడ్ ఇండస్ట్రీ తీవ్ర విషాదం చోటు చేసుకుంది. లెజండరీ సింగర్ ఎస్ జానకి కన్నుమూశారు. కొన్నాళ్లుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె మైసూర్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జానకి మృ తుదిశ్వాస విడిచారు. ఎస్. జానకి ఒక చిన్న పాపలా ఆమె పాడగలదు. ఎలాంటి సందర్భాన్నైనా తన గళంలో పలికించగలదు. జానకి తన 60 సంవత్సరాల పైన సినీ జీవితంలో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో దాదాపు 50,000 పైగా పాటలు పాడారు.

# కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరణ

**జయభేరి, హైదరాబాద్ :**

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ పర్యవేక్షణలో అందించే సిఫారసులు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నియమించిన నిపుణుల కమిటీ సూచనలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరణ చర్యలు చేపడుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బ్యారేజీల నిర్మాణం, నిర్వహణ, డిజైన్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలు ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో గేట్లు మూసి బ్యారేజీల్లో నీటిని నిలువచేయడం వల్ల ప్రమాదం పొంచి ఉందని ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకే నీటిని ఎత్తిపోయడం లేదని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తో పాటు మరికొందరు ప్రజాప్రతినిధులతో కలిసి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.
కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వచేసి ఎత్తిపోయడానికి వీలులేని పరిస్థితులు, ఎన్ డీఎస్ఏ నివేదిక అంశాలను ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు. "కాళేశ్వరం బ్యారేజీలను పునరుద్ధరించే విషయంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 2026 జూన్ 30 న టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీని నియమించింది. కాళేశ్వరంలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్, పునరుద్ధరణ అంశాలపై ఆ కమిటీ ప్రతిపాదనలకు లోబడి జరగాలని నిర్ధేశించారు. ఎన్‌డీఎస్ఏ (టెక్నికల్) సభ్యుడు చైర్మన్‌గా, సీడబ్ల్యూసీ (డిజైన్స్ - బీసీడీ) డైరెక్టర్, సీడబ్ల్యూసీ (డిజైన్ - గేట్స్) డైరెక్టర్, ఎస్ఎంఆర్ఎస్ నుంచి ఎస్ఈ స్థాయికి తగ్గకుండా ఒక ప్రతినిధి, సీడబ్ల్యూపీఆర్ఎస్ నుంచి ఎస్ఈ స్థాయికి తగ్గకుండా ఒక ఇంజనీర్, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎస్ఈ స్థాయికి తగ్గకుండా ముగ్గురు ప్రతినిధులు ఉండే విధంగా టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ తెలంగాణ ప్రభుత్వ నిపుణులు, ఈ రంగంలో జాతీయ అంతర్జాతీయ నిపుణులతో పాటు ఇతరేతర నిపుణుల అభిప్రాయాలను కూడా

...మిగతాది 2 లో



# వియత్నాంలో భారీ విషాదం

## బోటు మునిగి 15 మంది మృతి

**జయభేరి, న్యూ ఢిల్లీ, జులై 11;**

వియత్నాంలో భారీ విషాదం జరిగింది. భారత టూరిస్టులు ప్రయాణిస్తున్న బోటు ఒకటి నీట మునిగింది. ఈ ప్రమాదంలో పర్యాటకులు గల్లంతయ్యారు. వియత్నాంలోని ఫు క్వ్యాక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇందులో తెలుగువారు కూడా ఉన్నారు. ఈ మేరకు వియత్నాం హనోయిలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ప్రమాదం గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఎక్స్లో పోస్టు షేర్ చేసింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది చనిపోయినట్లు తెలుస్తోంది.

**ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన టూరిస్టులు!**

ఇటీవల ఓ మొబైల్ కంపెనీ 250 మందితో కూడిన ఒక బృందాన్ని భారత్ నుంచి వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. వీళ్లంతా మొబైల్ కంపెనీకి చెందిన డిస్ట్రిబ్యూటర్లుగా తెలుస్తోంది. అయితే ఇందులో 40 మంది తెలంగాణ, 35 మంది ఆంధ్రప్రదేశ్కు చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు.



## పిల్లల పెంపకం ఉమ్మడి బాధ్యత..
# సిజేరియన్లు తగ్గాలి!




- రాష్ట్రంలో నేటి నుంచే మరో నూతన విధానం."పిల్లలే సంపద"
- నాడు నియంత్రణ.. నేడు పాపులేషన్ మేనేజ్‌మెంట్
- అప్పుడు ఐటీ.. ఇప్పుడు ఏఐ.. రేపటి లక్ష్యం స్వర్ణాంధ్ర!
- సోషల్ మీడియా వ్యసనంపై సీఎం ఆందోళ న.. తెలంగాణ ఘటనపై విచారం

**జయభేరి, విజయవాడ :**

"దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ అప్పారావు మాటలను మరోసారి గుర్తుచేసుకోవాల్సిన సమయం వచ్చింది. జనం ఉంటేనే అభివృద్ధి సార్థకమవుతుంది, జనాభా ఉంటేనే నిజమైన భవిష్యత్తు ఉంటుంది" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదిక వద్ద వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2026 ఏడాది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా తమ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని చెబుతూ.. రాష్ట్రంలో ఇవాళ్టి నుంచే 'పిల్లలే సంపద' అనే నూతన విధానానికి నాంది పలుకుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా కార్యక్రమ ప్రాంగణంలో వైద్యారోగ్య శాఖ ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో వైద్యులు, వైద్య కళాశాలల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

**నాడు నియంత్రణ.. నేడు పాపులేషన్ మేనేజ్‌మెంట్**

సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గతంలో జనాభా పెరిగిపోతుందన్న ఆందోళనతో ప్రభుత్వాలు నియంత్రణ వైపు అడుగులు వేశాయని గుర్తు చేశారు. "అప్పట్లో మహిళల్లో అక్షరాస్యత పెంచడం ద్వారానే

...మిగతాది 2 లో



## వియత్నాం పడవ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి

- బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

**జయభేరి, న్యూఢిల్లీ :**

వియత్నాం పడవ బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను భారత అధికారులు అందిస్తున్నారని, స్థానిక వియత్నాం ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. "వియత్నాంలోని ఫు క్వాక్ సమీపంలో భారతీయ పౌరులు ప్రయాణిస్తున్న పడవ ప్రమాదానికి గురైన అత్యంత విషాదకరమైన వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు నా హృదయపూర్వక ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. అలాగే ప్రాణాలతో బయటపడి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను. వియత్నాంలోని మన భారత రాయబార కార్యాలయం, కాన్సులేట్ జనరల్ బాధితులకు సాధ్యమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తున్నాయి. మన అధికారులు స్థానిక వియత్నాం అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు" అని పేర్కొన్నారు. ప్రస్తుతం మోదీ మూడు దేశాల పర్యటనలో ఉన్నారు. న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్నారు. న్యూజిలాండ్ పర్యటన అనంతరం మోదీ భారత్‌కు తిరిగి రానున్నారు.

## హరీష్‌రావు సూచనలతోనే ఈటల రాజేందర్ మాట్లాడారు

- సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..



**జయభేరి, హైదరాబాద్ :**

గోదావరి జలాల వినియోగంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈటల అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ఆయన బీఆర్ఎస్ అజెండాను ముందుకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్‌లో తలెత్తిన సమస్యలను ప్రస్తావిస్తూ, కేసీఆర్ ప్రభుత్వం హయాంలోనే లోపాలు బయటపడ్డాయని సీఎం పేర్కొన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదికలో కూడా ఈ అంశాలు స్పష్టంగా నమోదయ్యాయని వెల్లడించారు. గోదావరిలో పారుతున్న నీటిని ఎత్తిపోయాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.. ఈ సమయంలో నీళ్లపై రాజకీయాలు వద్దంటూ హితవు పలికారు.. అయితే ఈటల కామెంట్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. క్యాంప్ ఆఫీస్‌లో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈటల అంటే తమకు గౌరవమేనన్న సీఎం రేవంత్ రెడ్డి.. కాళేశ్వరంపై ఈటల రాజేందర్ అవాస్తవాలు చెప్పారన్నారు. ఈటల కూడా BRS ఎజెండా ఎత్తుకున్నారంటూ విమర్శించారు. హరీష్‌రావు సూచనలతోనే ఈటల మాట్లాడారని.. ఈటల ఇప్పుడు గౌరవం పొగొట్టుకున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 2019 జూన్‌లో కాళేశ్వరం ప్రారంభించారని.. 2020 మేలో లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 11 నెలల్లోనే అధికారులు లోపాలు గుర్తించారన్నారు. KCR ఉన్నప్పుడే లోపాలు తెలిశాయన్నారు. నిర్లక్ష్యం కారణంగానే మేడిగడ్డ కుప్పకూలిందన్నారు. 2022 జూలైలో కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని వివరించారు. ఇప్పటికీ కన్నెపల్లి వినియోగంలోకి రాలేదని వివరించారు. 2023 అక్టోబర్‌లో NDSA కమిటీ వేసిందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే నివేదిక ఇచ్చారని.. లోపాలపై NDSA నివేదికలో పేర్కొన్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# తెరపైకి మెన్ కమిషన్

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ప్రముఖ గాయని జానకమ్మ కన్నుమూత

వీటిలో మలయాళం, కన్నడ భాషలలో పాడినవే ఎక్కువ. ఈమె ఉత్తమ గాయనిగా జాతీయ పురస్కారం 4 సార్లు, వివిధ రాష్ట్రాల నుంచి 31 సార్లు పొందారు. తెలుగు చలనచిత్ర సంగీత చరిత్రలో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్నారు ఎస్ జానకి. ముఖ్యంగా దక్షిణ భారత సినీ పరిశ్రమలో తన అద్భుతమైన స్వరంతో కొన్ని దశాబ్దాల పాటు శ్రోతలను ఓలలాడించిన మహోన్నత గాయని ఆమె. సినీ అభిమానులు, సంగీత ప్రియులు ఆమెను గౌరవంగా 'జానకమ్మ' అని పిలుచుకుంటారు. జానకమ్మ 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో ఉద్యోగ రీత్యా కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఉండేవారు. చిన్నతనం నుంచే సంగీతంపై ఉన్న ఆసక్తితో నాదస్వరం విద్వాంసుడు పైడిస్వామి వద్ద సంగీతంలో ప్రాథమిక శిక్షణ పొందారు. మూడవ ఏట నుంచి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1957లో తమిళ చిత్రం 'విధియిన్ విలయట్టు' ద్వారా ఆమె గాయనిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఈ చిత్రానికి టి.చలపతిరావు సంగీతం అందించారు. అదే ఏడాది 'ఎమ్మెల్యే' సినిమాలోని "నీ నవ్వే నీ జగాన..." అనే పాటతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత ఆమె వెనక్కి తిరిగి చూసుకోలేదు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు హిందీ, ఒడియా వంటి దాదాపు 17 భాషల్లో 50,000 పైగా పాటలు పాడి భారతీయ సంగీత రికార్డుల్లో నిలిచారు. చిన్న పిల్లల గొంతుతో పాడాలన్నా, పండితులను మెప్పించే శాస్త్రీయ సంగీతమైనా, పల్లె పదాల జానపదాలైనా జానకమ్మకు వెన్నతో పెట్టిన విద్య. 'స్వాతిముత్యం' సినిమాలో "చిన్నారి పొన్నారి కిట్టయ్య..." పాటలో ఆమె పలికించిన పసితనం ఎప్పటికీ మరువలేనిది. పాటలో భావాన్ని, ఎమోషన్‌ను పలకించడంలో ఆమె శైలి ప్రత్యేకం. గానగంధర్వుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఆమె పాడిన వేలాది యుగళ గీతాలు (Duets) టాలీవుడ్‌లో ఒక సువర్ణ అధ్యాయం. ఉత్తమ గాయనిగా 4 జాతీయ అవార్డులు అందుకున్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి బోలెడన్ని నంది అవార్డులు ,ఇతర రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్నారు. మైసూరు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ వచ్చింది. 2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మభూషణ్' అవార్డును, దక్షిణ భారత కళాకారులకు దక్కాల్సిన గుర్తింపు ఆలస్యంగా దక్కిందనే కారణంతో ఆమె నమ్రతతో తిరస్కరించడం ఆమె వ్యక్తిత్వానికి నిదర్శనం అనే చెప్పాలి.

## సిజేరియన్లు తగ్గాలి!

జనాభా నియంత్రణ సాధ్యమని భావించాం. 'ఒక్కరు ముద్దు.. ఇద్దరితో సరి.. ముగ్గురు వద్దు' అంటూ ప్రచారాలు చేశాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హులనే నిబంధనలు కూడా తెచ్చాం. కానీ, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ప్రస్తుతం జనాభా నియంత్రణ కాదు.. 'జనాభా సంరక్షణ, నిర్వహణ' అత్యంత కీలకం" అని సీఎం స్పష్టం చేశారు. యువత కేవలం 'మైక్రో ఫ్యామిలీల' (చిన్న కుటుంబాల) వైపు మొగ్గు చూపడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో జనాభా గణనీయంగా తగ్గిపోతోందని, భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో అంగన్‌వాడీలు, పాఠశాలల్లో చిన్నారుల సంఖ్య తగ్గిపోతోందని, వృద్ధుల సంఖ్య పెరుగుతోందని.. ప్రతి 100 మంది జనాభాలో 89 శాతం మందికి మొదటి, రెండో సంతానం లేకపోవడం ఆలోచించాల్సిన విషయమన్నారు. విశాఖపట్నం లాంటి జిల్లాల్లో ఫెర్టిలిటీ రేటు (సంతానోత్పత్తి రేటు) అతి తక్కువగా ఉందని, ఏపీ విస్తీర్ణంలో 7వ స్థానంలో ఉన్నా పాపులేషన్ డెన్సిటీలో వెనుకబడి ఉన్నామని, అందుకే రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

**అప్పుడు ఐటీ.. ఇప్పుడు ఏఐ.. రేపటి లక్ష్యం స్వర్ణాంధ్ర!**

20 ఏళ్ల క్రితం తాము తీసుకున్న ఐటీ విప్లవ నిర్ణయాల వల్లే నేడు ప్రపంచంలో ఎక్కడ చూసినా తెలుగువారే కనిపిస్తున్నారని, అత్యధిక ఆదాయం సంపాదిస్తూ సంపద సృష్టిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. "అప్పుడు ఐటీ గురించి మాట్లాడాను.. ఇప్పుడు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో పాటు పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి మాట్లాడుతున్నాను. జనాభా లేకపోతే మనం సాధించాలనుకున్న అభివృద్ధి లక్ష్యాలను చేరుకోలేం. 15 శాతం వృద్ధి రేటుతో ముందుకు సాగితే 2040 నాటికే 'స్వర్ణాంధ్ర' సాధిస్తాం. అలాగే, 2047 నాటికి మన రాష్ట్ర తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చాలన్నదే నా సంకల్పం" అని సీఎం ధీమా వ్యక్తం చేశారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందుకోసం 'పీ4' విధానం ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచుతున్నామని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో సమతూక అభివృద్ధి కోసం అన్ని ప్రాంతాలకూ పరిశ్రమలు, ప్రాజెక్టులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

**పిల్లల పెంపకం ఉమ్మడి బాధ్యత.. సిజేరియన్లు తగ్గాలి!**

పిల్లలను పెంచడం అనేది కేవలం మహిళల బాధ్యత మాత్రమే కాదని, అది భార్యాభర్తలిద్దరి ఉమ్మడి బాధ్యత అని సీఎం చంద్రబాబు హితవు పలికారు. పురుషులు కూడా పిల్లల పెంపకంలో సమానంగా బాధ్యతలు పంచుకోవాలని సూచించారు. మహిళల ఆరోగ్య రక్షణ అత్యంత కీలకమని, కాన్పుల్లో అనవసర సిజేరియన్లను తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగం చేసే మహిళల కోసం పని ప్రదేశాల్లో త్వరలోనే 'చైల్డ్ కేర్ కేంద్రాలు' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికే అంగన్‌వాడీల నుంచే పిల్లల ఆరోగ్యంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తోందని, పాఠశాలల్లో నాణ్యమైన విద్య కోసం 'తల్లికి వందనం' కింద ప్రతి ఒక్కరికీ రూ.15 వేల చొప్పున అందిస్తున్నామని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఇప్పటికే 'సంజీవని' కార్యక్రమం చేపట్టామని, త్వరలోనే ప్రభుత్వం 'క్షేమం' అనే మరో నూతన కార్యక్రమాన్ని తీసుకురావడానికి ఆలోచన చేస్తోందని వెల్లడించారు. భారతదేశానికే సొంతమైన అద్భుతమైన వరం 'కుటుంబ వ్యవస్థ' అని, ఈ వారసత్వాన్ని కాపాడుకుంటూ ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.


సోషల్ మీడియా వ్యసనంపై సీఎం ఆందోళన.. తెలంగాణ ఘటనపై విచారం ఇదే వేదికపై నుంచి తెలంగాణలో జరిగిన ఒక దారుణ ఉదంతంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోక్సో (POCSO) కేసు ఉన్న ఒక నిందితుడు.. తనపై కేసు పెట్టిన వారి కుటుంబ సభ్యులనే దారుణంగా హత్య చేయడం అత్యంత బాధాకరమన్నారు. సమాజంలో ఇలాంటి నేరాలు పెరగడానికి సోషల్ మీడియా బాధ్యతారహిత వినియోగం కూడా ఒక కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన, హింసాత్మక దృశ్యాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా యువతకు వ్యసనంగా మారితే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని హెచ్చరిస్తూ.. యువత 'టెక్నాలజీ స్పిరిచువాలిటీ' (సాంకేతికతఆధ్యాత్మికత) కలయిక ద్వారా ప్రపంచాన్ని జయించే శక్తిని సొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువత నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకుంటూ దేశానికి నాణ్యమైన వర్క్ ఫోర్స్‌గా మారాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శస్త్ర చికిత్స విజయవంతం

జయభేరి, అమరావతి :

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముంబయిలో నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతం అయింది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డా.దిన్షా పార్దీవాలా నేతృత్వంలోని వైద్యుల బృందం పవన్ కల్యాణ్ కుడి భుజానికి సర్జరీ నిర్వహించారు. రొటేటర్ కఫ్ ఇంజ్యూరీతో పాటు, భుజానికి అవల్షన్ ఫ్రాక్చర్ ఉండటంతో భారీ సర్జరీ చేయాల్సి వచ్చింది, ఈ సర్జరీకి మూడున్నర గంటల సమయం పట్టింది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

# తెర పైకి మెన్ కమిషన్




ఇది అత్యంత బాధాకరమైన విషయం.. ఎందుకంటే జరుగుతున్న సంఘటనలు అలా ఉన్నాయి కాబట్టి. గతంలో ఎన్నడూ కూడా ఈ విధంగా లేదు.. ఇలాంటి సంఘటనలు జరగలేదు. కానీ ఇప్పుడు ఒక దాని తర్వాత ఒకటి చోటు చేసుకుంటున్నాయి. ఎలా ఉంటున్నాయి అంటే.. ఒకదాన్ని మించి మరొకటి ఉంటున్నాయి. పైగా భయాన్ని కలగజేస్తున్నాయి. జీవితంలో పెళ్లి అంటేనే వెన్నులో వణుకు పుట్టే విధంగా చేస్తున్నాయి.పూణేలో కేతన్ అగర్వాల్‌ను అతనికి కాబోయే భార్య సియా, ఆమె ప్రియుడు చేతన్ చంపేసిన తర్వాత.. ఆ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత.. ఈ కేసు కు సంబంధించిన అనేక సంచలన నిజాలు ఒకదాని వెంట ఒకటి బయటపడుతున్న తర్వాత.. మనదేశంలో ఒక రకమైన చర్చ నడుస్తోంది. ఆ చర్చ ఏకంగా పార్లమెంట్ దాకా వెళ్ళింది. పైగా పెద్ద పెద్ద రాజకీయ నాయకులు కూడా జరుగుతున్న పరిణామాలను చూసి భయపడుతున్నారు. దేశంలో ఒక వింత, విచిత్రమైన, మునుపెన్నడూ ఊహించని చర్చ మొదలైంది. ఇప్పటివరకు 'మగాడ్రా బుజ్జీ.. నీకేం తక్కువ?' అంటూ మీసాలు తిప్పిన పురుష పుంగవుల కోసం ప్రత్యేకంగా ఒక కమిషన్ కావాలంటూ రాజ్యసభ ఎంపీ అశోక్ కుమార్ మిట్టల్ ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును పార్లమెంట్‌లో పడేశారు.

"జాతీయ మహిళా కమిషన్" తరహాలోనే, ఇకపై "జాతీయ పురుషుల కమిషన్" కూడా పెట్టాలని ఆయన డిమాండ్. ఈ బిల్లు బయటకొచ్చిందో లేదో.. పుణెలో జరిగిన కేతన్ అగర్వాల్ హత్య కేసు పుణ్యమా అని సోషల్ మీడియాలో 'మెన్ ఆర్ ఆల్సో హ్యూమన్స్' (మగాళ్లు కూడా మనుషులే) అనే ట్రెండ్ ఊపందుకుంది. కన్నీళ్లు పెడుతున్న 'కండల వీరులు' సమాజంలో మగాడంటే ఎప్పుడూ స్ట్రాంగ్‌గా ఉండాలి, ఏడవకూడదు.. భరించాలి అనే రూల్స్ ఉన్నాయి కదా! కానీ ఈ బిల్లు తెచ్చిన లెక్కలు చూస్తుంటే మగాళ్ల గుండెల్లో దాగున్న బాధలు హిమాలయాలంత ఉన్నట్టు కనిపిస్తోంది. ఇంట్లో భార్య చేతిలో లేదా బెల్లం ముక్క లాంటి అత్తగారి చేతిలో దెబ్బలు తిన్నా బయటకు చెప్పుకోలేక కుమిలిపోయే భర్తలు ఎందరో.. ఎక్స్ లోనో, పోలీస్ స్టేషన్ లోనో ఒక్క తప్పుడు కేసు పడితే.. కెరీర్ గోవిందా! విడాకులయ్యాక పిల్లల్ని చూడనివ్వకుండా కేవలం మెయింటెనెన్స్ డబ్బుల కోసం మాత్రమే వాడుకునే 'ఏటీఎం' మిషన్లుగా మగాళ్లు మారుతున్నారట. ఆఫీసు ఒత్తిళ్లు, సామాజిక అంచనాలు తట్టుకోలేక దేశంలో పురుషుల ఆత్మహత్యల శాతం రాకెట్‌లా దూసుకెళ్తుంటే.. "అయ్యో పాపం" అనే నాథుడే కరువయ్యాడని పురుషుల హక్కుల సంఘాలు గొంతు చించుకుంటున్నాయి.

ఒకవేళ దేవుడు కరుణించి అంటే పార్లమెంట్ ఒప్పుకొని ఈ కమిషన్ ఏర్పాటైతే.. మగాళ్లకు ఒక 'సేఫ్ జోన్' దొరుకుతుంది. "మా ఆవిడ నన్ను రోజుకు పదిసార్లు తిడుతోంది సార్" అని ఏడ్చే భర్తలకు ఉచితంగా టిష్యూ పేపర్లు, మానసిక ధైర్యం ఇస్తారు. ఉచిత న్యాయ సహాయం కింద తప్పుడు కేసుల నుంచి ఎలా తప్పించుకోవాలో లాయర్లతో ఫ్రీగా సలహాలు ఇప్పిస్తారు. అలిగిన భర్తలకు, అత్తగారి వేధింపులకు గురయ్యే అల్లుళ్లకు ఇదొక పెద్ద దిక్కు అవుతుంది."మేమేదో మహిళల హక్కులను లాగేసుకుందామని చూడట్లేదు బాబోయ్! వాళ్ల చట్టాలు వాళ్లకుండనివ్వండి.. మాకు కనీసం ఒక చిన్న కంప్లైంట్ బాక్స్ అయినా ఇవ్వండి" అని బిల్లు ప్రతిపాదకులు చేతులు జోడించి మరీ చెప్తున్నారు. చట్టం అవుతుందా.. లేక చాయ్ బిస్కెట్ ముచ్చటవుతుందా? మన దేశ పార్లమెంట్ చరిత్ర చూస్తే 'ప్రైవేట్ మెంబర్ బిల్లులు' చట్టాలుగా మారడం అనేది.. లాటరీలో కోటి రూపాయలు తగలడం కంటే అరుదు. కాబట్టి ఈ బిల్లు రేపో మాపో చట్టం అయిపోయి, మగాళ్లందరికీ రక్షణ వచ్చేస్తుందని పగటి కలలు కనడం కాస్త అత్యాశే అవుతుంది. అయినప్పటికీ "మగాడికి కూడా మనసుంటుంది, వాడికీ కష్టాలొస్తాయి" అనే ఒక టాపిక్ మీద పార్లమెంట్ లో చర్చ జరగడమే ఒక పెద్ద అద్భుతం. మరి ఈ పురుషుల కమిషన్ ముచ్చట ఎంతవరకు వెళ్తుందో అధికార పక్షం దీనిపై ఎలాంటి 'పంచ్‌లు' వేస్తుందో చూడాలి.

అంతవరకు.. ఆల్ ది బెస్ట్ మగాళ్లూ! మీ బాధలను వినడానికి కనీసం ఒక బిల్లు అయినా పుట్టుకొచ్చింది, సంతోషించండి.. ఇది పద్ధతి కాదు.. ఇది విధానం కాదు.. దీనికి పాడాలి చరమగీతం అన్నట్టుగా మాట్లాడుతున్నారు.ఇటీవల కాలంలో మగవాళ్ళను ప్రియురాళ్లు, భార్యలు చంపేస్తున్న నేపథ్యంలో.. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పెళ్లి చేసుకోవాలంటే మగవాళ్ళు భయపడిపోతున్నారు. అసలు ఇలా కూడా జరుగుతుందా.. ఇలా ప్రాణాలు తీస్తుంటే ఇక పెళ్లిళ్లు ఎందుకు చేసుకోవాలని మగవాళ్ళు ప్రశ్నిస్తున్నారు.

ఒంటరి జీవితమే బాగుంటుందని.. ఒంటరిగా మిగిలిపోవడమే గొప్పగా ఉంటుందని భావిస్తున్నారు. మగవాళ్ళ బాధలు చూడలేక కొన్ని సందర్భాలలో రాజకీయ నాయకులూ స్పందిస్తున్నారు. తాజాగా అశోక్ కుమార్ అనే రాజ్యసభ సభ్యుడు పెద్దల సభలో కీలక వ్యాఖ్యలు చేశాడు. మగవాళ్ళ మీద రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని.. మగవాళ్ళను చంపేస్తున్నారని.. మగవాళ్ళ ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందని.. చెబుతూ.. మగవాళ్లకు కూడా కమిషన్ ఏర్పాటు చేయాలని.. ఆడవాళ్ళ నుంచి మగవారిని కాపాడాలని ఆయన సాక్షాత్తు పెద్దల సభలో వ్యాఖ్యానించడం విశేషం. అయితే ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల మెజారిటీ ప్రజల నుంచి సానుకూల ప్రకటన రావడం గమనార్హం.


## కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరణ

తీసుకుంటుందని ఆ కమిటీని నియమిస్తూ జలశక్తి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను నిర్దేశించింది" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదికను పరిగణలోకి తీసుకుని టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ సూచనలను తూ.చ తప్పకుండా పాటించి అందుకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "ప్రస్తుత పరిస్థితుల్లో బ్యారేజీల్లో నీటిని నిలువచేయడానికి ఏమాత్రం సహేతుకం కాదని ఎన్‌డీఎస్‌ఏ తన నివేదికలో చాలా స్పష్టంగా తెలిపింది. ప్రస్తుత సమస్యలతో పాటు పరిష్కారానికి అవసరమైన సూచనలు అన్నీ చేసింది.. అని చెప్పారు. ఆ నివేదికను పరిగణలోకి తీసుకుని ప్రాజెక్టును పునరుద్ధరించడానికి నిపుణుల కమిటీ సూచనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుంది" అని అన్నారు. నీరు పారుతున్నప్పటికీ గోదావరి నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని, ఆ విషయంలో ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని, బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నందునే ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర వివరాలు తెలియజేస్తున్నాం అని వివరించారు. ఈ విషయంలో కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆక్షేపిస్తూ, ఎన్‌డీఎస్‌ఏ సూచనలను పరిగణలోకి తీసుకుని మాట్లాడితే బాగుండేదని వ్యాఖ్యానించారు. "గోదావరి నదిలో నీళ్లు పారినంత మాత్రాన ఎత్తిపోయడానికి వీలుకాదు. అందుకు బ్యారేజీలు ఏమాత్రం అనుకూలం కాదు. నీటిని ఎత్తిపోయాలంటే ముందు నీటిని నిల్వచేయాలి. నిలువ చేయకుండా నీటిని ఎత్తిపోయడానికి అవకాశమే లేదు. పారుతున్న గోదావరి నుంచి నీటిని ఎత్తిపోయడానికి బ్యారేజీలు ఎందుకు? అని ప్రశ్నించారు. "దేశంలోని ప్రాజెక్టులు, డ్యామ్‌ల పర్యవేక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 30 న పార్లమెంట్ ద్వారా డ్యామ్ సేఫ్టీ యాక్ట్‌ను తెచ్చింది. ఈ అథారిటీ దేశ వ్యాప్తంగా ఎక్కడైనా సరే డ్యామ్‌ల తనిఖీలు, పర్యవేక్షణ, నిర్వహణ, మరమ్మతులకు సంబంధించి తగిన యంత్రాంగంతో చట్టం రూపొందించారు. ఇలాంటి సందర్భాల్లో ఏ రాష్ట్రమైనా ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలు, సూచనలు పాటించాల్సిందే. 2023 లో మేడిగడ్డ ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే ఎన్‌డీఎస్‌ఏ పర్యటించి ప్రాథమిక నివేదిక అందించింది. ఆ తర్వాత పూర్తి స్థాయి నివేదికను అందించింది. మేడిగడ్డ 7వ బ్లాక్ వద్ద బ్యారేజీ పిల్లర్లు 1.2 మీటర్లు కుంగిపోయింది. ప్లానింగ్, డిజైన్, నిర్మాణం, నిర్వహణ లోపాల కారణంగానే ఆ ప్రమాదం ఏర్పడిందని చాలా స్పష్టంగా నివేదికలో పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో బ్యారేజీల్లో నీటిని నింపితే ప్రమాదకరమని ఎన్‌డీఎస్‌ఏ తన 365 పేజీల నివేదికలో చాలా స్పష్టంగా పేర్కొంది. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంలలో నీటిని నింపడానికి పనికి రావు. మేడిగడ్డ 7వ బ్లాక్ డ్యామేజీ కావడం వల్ల మొత్తం బ్యారేజీపై ప్రభావం చూపించి దెబ్బతిన్నదని, ఆ కారణంగా నీటి నిల్వ సాధ్యం కాదని తేల్చింది. ఇప్పుడున్న దుస్థితిని అరికట్టడానికి మూడు బ్యారేజీల స్థిరీకరణ, పునరుద్ధరణకు, సమగ్రమైన అంచనాలు అవసరమని ఎన్‌డీఎస్‌ఏ తన ఎగ్జిక్యూటివ్ సమ్మరీలో తేల్చిచెప్పింది. మొత్తం ప్రాజెక్టు పునరుద్ధరించాలంటే డిజైన్లు, మరమ్మతులు ఎన్‌డీఎస్‌ఏ లేదా సీడబ్ల్యూసీ ఆమోదంతో మాత్రమే చేయాలని స్పష్టంగా చెప్పింది" అని ముఖ్యమంత్రి గారు స్పష్టంగా వివరించారు. "నీటిని ఎత్తిపోయడానికి పంపులు పనిచేయాలంటే మేడిగడ్డ బ్యారేజీ వద్ద 93.5 మీటర్ల మేరకు నీటిని నింపాలి. అప్పుడే పంపులకు నీటిని నింపడానికి వీలవుతుంది. నీటిని ఎత్తిపోయడానికి నిరంతరంగా ఆ స్థాయిలో బ్యారేజీలో నీటిని నిలువ చేయాలి. కనీసం 5 టీఎంసీల నీటిని నింపినప్పుడే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేసి అన్నారంలో పోయాలి.

బ్యారేజీల్లో నీటిని నిలువ చేయాలంటే గేట్లు మూయాలి. గేట్లు మూస్తే మొత్తం బ్యారేజీకే ప్రమాదం పొంచి ఉందని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించింది. పైగా బ్యారేజీ గేట్లపైన హైడ్రాలిక్ ఒత్తిడిని తట్టుకునే పరిస్థితి లేనందున, మరమ్మత్తులు చేసే వరకు గేట్లు మూయొద్దని, అన్ని గేట్లను ఎత్తిపెట్టాలని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టంగా చెప్పింది" అని తెలిపారు. "గేట్లు మూయలేని పరిస్థితి ఉన్నప్పుడు మేడిగడ్డ నుంచి ఎత్తిపోసిన నీళ్లు అన్నారం నుంచి తిరిగి మేడిగడ్డకే చేరుకుంటాయే తప్ప ప్రయోజనం లేదు. అన్నారం 116.5మీటర్ల ఎత్తున నిల్వచేసి ఎత్తి, సుందిళ్లలో పోస్తే సుందిళ్ల బెడ్ లెవల్ 126.5 మీటర్లు మేరకు దాదాపు 20 మీటర్ల ఎత్తు నీటిని నిల్వచేయాలి. ఇలా ఒకదానిపై ఇంకొకటి ఆధారపడి, నీటిని నిల్వ చేయకుండా ఎత్తిపోయడం అసలు సాధ్యం కాదు. గేట్లు మూసి నీటిని నిల్వ చేయడం వల్ల ప్రాజెక్టు మొత్తానికి ప్రమాదం ఉండొచ్చు. భద్రాచలం పట్టణం వరదలతో ముంచెత్తవచ్చు. ఊర్లకు ఊర్లు కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది" అని హెచ్చరించారు. "నిజానికి ఈ ప్రాజెక్టుకు ప్రాణవాయువు, గుండెకాయ శ్రీపాద ఎల్లంపల్లి. గుండెకాయతో ఇప్పుడు ప్రాజెక్టు సాగుతోంది. 2019 జూన్ 21 న కాళేశ్వరం ప్రారంభిస్తే, ప్రాజెక్టు పూర్తి కాకముందే, 2020 మే 18 ఆనాటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇందులో లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దకుండా నిర్మాణాలు చేపడితే బ్యారేజీకే ప్రమాదం ఉందని తెలియజేస్తూ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీకి లేఖ రాశారు. (లేఖలోని అంశాలను చదివి వినిపించారు) ప్రాజెక్టును ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు ఉన్నాయని తెలిపారు" అని ముఖ్యమంత్రి గారు గుర్తుచేశారు. "ఆ లోపాలను సరిదిద్దకపోవడం, పూర్తిగా నిర్లక్ష్యం వహించిన కారణంగా మేడిగడ్డ కుప్పకూలింది. దీనికి ముందు 2022 జూలై 14 న గోదావరి పోటెత్తిన సమయంలో రిటెయినింగ్ వాల్ కూలి కన్నెపల్లి పంప్‌హౌజ్ పూర్తిగా మునిగిపోయి దెబ్బతిన్నది. ఆ పంప్‌హౌజ్‌ను ఇప్పటికీ నూటికి నూరు శాతం సరిదిద్దలేదు. మేడిగడ్డ కుంగిపోయిన మరుసటిరోజున మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా చేయబడింది. 2023 అక్టోబర్ 22 న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణులు పరిస్థితిని పరిశీలించి ప్రాజెక్టు డిజైన్, ప్లానింగ్, నాణ్యత, నిర్మాణం, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలను ఎత్తిచూపుతూ ఆ కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందని ప్రాథమిక నివేదిక అందించారు" అని చెప్పారు. "ప్రాజెక్టు పునరుద్ధరణకు నిపుణులతో ఏర్పాటు చేసిన కమిటీ, ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులను పాటించాలన్న సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుంది. వారి పర్యవేక్షణలో ప్రాజెక్టును పునరుద్ధరిస్తున్నాం. నిపుణుల పర్యవేక్షణలో ప్రాజెక్టును పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రాజెక్టు పునరుద్ధరణ విషయంలో మాకు ఎలాంటి దురుద్దేశం లేదు. ఈ నెలలో టెస్టింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత ముంబయ్ ఐఐటీ, అంతర్జాతీయ నిపుణుల సూచనల మేరకు పునరుద్ధరణ పనులను ప్రారంభిస్తాం. ఈ విషయంలో ఎన్‌డీఎస్‌ఏకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుంది" అని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు.

## 'SIR' ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తేనే ఓటరు జాబితాలో పేరు

- సీఈఓ సుదర్శన్ రెడ్డి



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (CEO) సి. సుదర్శన్ రెడ్డి కీలక స్పష్టతనిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ వినూత్న సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు (BLO) పంపిణీ చేసే 'ఎన్యూమరేషన్ పత్రాన్ని' పూర్తిగా నింపి సమర్పిస్తేనే రాబోయే డ్రాఫ్ట్ (ప్రాథమిక) ఓటర్ల జాబితాలో పేరు కొనసాగుతుందని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లను గుర్తించి, బోగస్ ఓట్లను తొలగించేందుకు దాదాపు 24 ఏళ్ల తర్వాత (చివరిగా 2002లో జరిగింది) చేపట్టిన ఈ భారీ కసరత్తులో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల జూలై 31న విడుదలయ్యే డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువులోగా 'ఫామ్6' ద్వారా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ వంటి ప్రధాన పట్టణ ప్రాంతాల్లో బీఎల్వోలు ఇళ్లకు రావడం లేదని, ఎన్యూమరేషన్ పత్రాలు ఇవ్వడం లేదంటూ మీడియా ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలపై సీఈఓ సీరియస్‌గా స్పందించారు. బీఎల్వోలు తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి ఫామ్‌లను స్వయంగా అందజేసి, ఓటర్ల వివరాలు సేకరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని కరాఖండిగా ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని లోపాలను సరిదిద్దేందుకు పర్యవేక్షకులను రంగంలోకి దించామని, హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఎన్యూమరేషన్ పూర్తి చేసే అవకాశం ఉందని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును భద్రపరుచుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.

## కేవైసీ పై అవగాహన అవసరం

జయభేరి, హైదరాబాద్ :

ప్రస్తుతం అన్ని రకాల ప్రభుత్వ ప్రైవేటు సంస్థల సేవలను నిరంతరాయంగా కొనసాగించుకోవాలంటే కేవైసీ తప్పనిసరి అని కే పి ఇంటర్ లింక్ సంస్థ గ్లోబల్ లీడర్ పూర్ణిమ అన్నారు. ఎర్రగడ్డలోని సంస్థ కార్యాలయంలో క్రిప్టో మైనింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు, కేవైసీ సంబంధిత సమస్యలు అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఉచితంగా కేవైసీలు నిర్వహించి లబ్ధిదారులు ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనే అంశాలను తెలియజేశారు. ఆధునిక సాంకేతికత అభివృద్ధి చెందుతున్న ప్రతి దశలో అవకాశాలు వెల్లువలా వస్తాయని వాటిపై అవగాహన పెంచుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. భవిష్యత్తు మొత్తం ఏఐ, డిజిటల్ కరెన్సీ దేనని ఆయా రంగాలపై అవగాహన పెంపొందించుకున్న వారు ఉజ్వలంగా రాణిస్తారని అన్నారు. సంస్థ కోర్ అంబాసిడర్ కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

# ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

**జయభేరి, యాదగిరిగుట్ట, జూలై 11 :**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ప్రధానాలయ ముఖ మండపంలోని బంగారు వాకిలి వద్ద నూతన ట్రస్టు బోర్డు (ధర్మకర్తల మండలి) శనివారం పదవీ ప్రమాణ స్వీకారం చేసింది. మంగళ వాయిద్యాలు,వేద మంత్రోచ్చరణల మధ్య చైర్మన్, సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరయ్యారు. యాదగిరిగుట్ట ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం.సత్యనారాయణ రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులుగా వినోద్ వెంకటస్వామి, కొణిదెల సురేఖ, చిలప్పగారి విజయ రాజం, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండా మల్లయ్య, స్వాతి కంఠమణి, ఎం. రాఘవేంద్రరావు, డాక్టర్.లక్ష్మీనారాయణ నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారికి ట్రస్టు బోర్డు చైర్మన్ తో సహా సభ్యులు అంతా ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత తొలి ధర్మకర్తల మండలి కి వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో భవాని శంకర్ వారందరికీ స్వామివారి లడ్డు ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.



## వైభవంగా తిరుచ్చి సేవ

- సాంప్రదాయ రీతిలో చైర్మన్ అళ హరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు
- అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చిన స్వామివారు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవ పవిత్ర పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామి వారిని దేవస్థానం పురవీధుల గుండా ఊరేగించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వైద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినా మశ్చరణల మధ్య స్వామి వారి సేవ ముందుకు కదిలింది. ఈ సందర్భంగా దేవాలయంలోని రథ ఆధ్వర్యంలో అళహరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తిరిగి మళ్ళీ తిరుచ్చి వాహనంపై గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చి వాహనంపై అలంకరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు తన్మయం చెందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ ,ఈఓ శ్రీనివాస రాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య పర్యవేక్షకుడు నిత్యానంద చారి, దేవస్థానం పురహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## 12న 'సర్' పై ముఖ్య నాయకుల సమావేశం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో ఈ నెల 12న 'సర్' పై ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజు ముందుగా ఉదయం 9 గంటలకు రాష్ట్ర నాయకుడు, వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షుడు రాజ వర్ధన్ రెడ్డి నివాసంలో కొత్తకోట మండలం, కొత్తకోట పట్టణం, చిన్న చింతకుంట, మదనాపురం, అడ్డాకుల మండల నాయకులు, మండల, జిల్లా మరియు రాష్ట్ర పదాధికారులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు. అలాగే అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు బిజెపి కార్యాలయంలో దేవరకద్ర మండలం, దేవరకద్ర మున్సిపాలిటి, కౌకుంట్ల,భూత్పూర్ మండలం మరియు మున్సిపాలిటీ మూసాపేట మండలం కు చెందిన పార్టీ నాయకులు ఖచ్చితంగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి మహబూబ్ నగర్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డిలు హాజరవుతున్నట్లు కొండ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

# ఫేక్ డిగ్రీలు.. 3 వేల మంది టీచర్ల తొలగింపు

**జయభేరి, బీహార్ :**




బీహార్ లో నకిలీ సర్టిఫికేట్లు, ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా ఉద్యోగాలు పొందిన దాదాపు 3 వేల మంది ఉపాధ్యాయులను విధుల్లోంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 2006 నుంచి 2015 మధ్య కాలంలో జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై విజిలెన్స్ బ్యూరో సుదీర్ఘ దర్యాప్తు చేపట్టింది. విజిలెన్స్ అధికారులు సమర్పించిన సమగ్ర నివేదిక ఆధారంగానే ప్రభుత్వం ఈ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోంది. కేవలం ఉద్యోగాల నుంచి తొలగించడమే కాకుండా, సదరు ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభించింది. ఇప్పటికే ఈ స్కామ్తో సంబంధం ఉన్న పలువురిపై ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. తప్పు చేసిన వారెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, అక్రమ మార్గాల్లో ఉద్యోగాలు సంపాదించి, ఇన్నేళ్లుగా ప్రభుత్వ ఖజానా నుంచి వారు పొందిన జీతాలు, గౌరవ వేతనాలను వదిలేయకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఇంతకాలం వారు తీసుకున్న వేతన సొమ్ము మొత్తాన్ని వడ్డీతో సహా రికవరీ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయం విద్యాశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

## మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత



**జయభేరి, తుర్కపల్లి, జూలై 11 :**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన ఆవుల శాంతమ్మ మరణించడంతో ఆమె కుమారులైన మల్లేశం, రాములు లకు బొత్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొత్త రాములు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెద్దగొల్ల కిష్టయ్య,యాదవ సంఘం అధ్యక్షుడు ఆవుల వెంకటేశం, పాల సంఘం చైర్మన్ సాగ బాలరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఆలేటి శ్రీశైలం, ఆవుల కృష్ణమూర్తి, బర్ల అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో మాదిగలకు అన్యాయం జరుగుతోంది

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

**జయభేరి, యాదగిరిగుట్ట:**



స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మాదిగలు అన్ని రంగాల్లో అన్యాయానికి గురవుతూనే ఉన్నారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తెలిపారు. శనివారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదురించేందుకు మాదిగ మహాశక్తి ఆర్గనైజేషన్ పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశామని,తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నామని తెలిపారు.

మాదిగ మహాశక్తి ఆర్గనైజేషన్ ఏ వర్గానికి, రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని,అన్ని వర్గాలను కలుపుకొని ముందుకెళ్తామని తెలిపారు. రాజకీయంగా దెబ్బతిన్న కులాలన్నీ తమ వాయిస్‌ను వినిపించాలన, అన్ని వర్గాల్లో చైతన్యం రావాల్సి ఉందని సూచించారు. జనాభా దామాషా ప్రకారం అన్ని కులాలకు న్యాయం జరగాలని, కానీ ఒకే కులం వారు రాజ్యమేలుతున్నారు. అసెంబ్లీలో సైతం రెడ్డి కులస్తులు ఎక్కువ మంది ఉన్నారని,బడుగు బలహీన వర్గాల వారు బిచ్చగాళ్లలా మారిపోయారని విమర్శించారు. ఓట్లేమో బడుగు బలహీన వర్గాలవవుతున్నాయి.

సీట్లేమో వాళ్లు అనుభవిస్తున్నారని,అందుకే వెనుకబడిన కులస్తులందరినీ చైతన్య పరుస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలకనుగుణంగా ముందుకెళ్తామని, అవసరమైతే ఎవరితోనైనా కలిసి పనిచేస్తామన్నారు. యాదాద్రి ఆలయ ట్రస్ట్ బోర్డు విషయంలో స్థానికులకు అన్యాయం జరిగిందని, కనీసం స్థానిక ఎమ్మెల్యేకు కూడా గౌరవం లేకుండా చేశారని విమర్శించారు. యాదగిరిగుట్ట ఆలయ ట్రస్ట్ బోర్డులో ఎమ్మెల్యేకైనా అవకాశం కల్పిస్తే స్థానికులకు కూడా గౌరవం ఉండేదన్నారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు,వివిధ పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి




**జయభేరి, తుర్కపల్లి, జూలై 11 :**

బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని తుర్కపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం మల్కాజ్గిరి జిల్లా కీసర మండల కేంద్రంలో బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాలను స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలను తయారు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుండా సిద్దులు, పుట్ట సాయిలు, శివరాత్రి లావణ్య జహంగీర్, దొనికేని రేణుక వెంకటేష్ యాదవ్, రాగుల లక్ష్మీరామచంద్రయ్య, ధరావత్ రజనీ సురేందర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మధుర గాన స్వరానికి యజమానురాలు గాన కోకిల జానకి

- దేవరకద్ర 4వ వార్డు బిజెపి కౌన్సిలర్ ఉమారాజ్



**జయభేరి, దేవరకద్ర :**

భారతీయ సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయే మధుర గాన స్వరానికి యజమానురాలు లక్షలాది సంగీతాభిమాన హృదయాలను అలరించిన గాన కోకిల ఎస్.జానకి అని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ 4వ వార్డు బిజెపి కౌన్సిలర్ ఉమారాజ్ అన్నారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆమె ఆలపించిన వేలాది గీతాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి అని ఆమె అన్నారు. సంగీత ప్రపంచానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. "మీ గానం చిరంజీవి.. మీ జ్ఞాపకాలు శాశ్వతం.." అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఆమెకు భావ పూర్వక శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని కౌన్సిలర్ ఉమా రాజ్ అన్నారు.

# 224 కోట్లతో బీటీ రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన

- మంత్రులతో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట :**



రాజకీయాలకు అతీతంగానే యాదాద్రి ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటైందని,భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ట్రస్ట్ బోర్డును సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. శనివారం యాదగిరిగుట్టలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరులతో ఆయన మాట్లాడుతూ స్థానికులకు ట్రస్ట్ బోర్డులో అవకాశం కల్పించలేదని ఎవరూ చింతిచొద్దని,టీటీడీ తరహాలో యాదాద్రి ఆలయం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే ట్రస్ట్ ఏర్పాటు జరిగిందని తెలిపారు. పాలకమండలిలో తన పేరు లేకపోయినా ప్రతీ కార్యక్రమంలో నేను పాల్గొనే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలను కల్పించాలనే లక్ష్యంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.224 కోట్ల వ్యయంతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం వంగపల్లి గ్రామంలో పైలాన్ ప్రాజెక్టు కింద శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

ఈ శంకుస్థాపనకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం వంగపల్లి గ్రామంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రైతులు,ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నూతన చైర్మన్లు,డైరెక్టర్లను ఇదే వేదికపై ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజలకు సురక్షితమైన,వేగవంతమైన రవాణా సౌకర్యం అందడంతో పాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించగలరని,వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటాయని తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని,ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, మౌలిక వసతులు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డైరెక్టర్లు,పలువురు ప్రజాప్రతినిధులు,నేతలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్న BRS పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్

**జయభేరి, డిండి :**

డిండి మండలం ఖానా పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ ఇచ్చిన మాట ప్రకారం గుడి నిర్మాణాన్ని సహకరించి నిర్మాణం పూర్తి అయిన తర్వాత ఖానాపూర్ గ్రామ పంచాయతీ ప్రజల ఆహ్వానం మేరకు గుడినీ దర్శించుకోవడం జరిగింది. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. ఖానాపూర్ BRS పార్టీ నాయకులు బొడ్డుపల్లి జయంత్, తుమ్మల శ్రీనివాస్ రెడ్డి, అలుగు బెల్లి సత్తి రెడ్డి, MD భాష ,లోకసాని సాయి, శ్రీను, సైదులు ,దాసు, వెంకటయ్య, శ్రీను ,లక్ష్మయ, నరసింహ, శ్రీను ,సైదులు , పెద్ద తండా మాజీ సర్పంచ్ కాట్రావత్ వెంకటేష్, బాలాజీ నాయక్, ఉప సర్పంచ్ విజయ్, తదితరులు పాల్గొనారు.



## రాక్‌బాల్ క్రీడాకారుడు గోపాల్ యాదవ్‌కు సన్మానం

✍ జయభేరి, మేడ్చల్ :

దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నీలో భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకం సాధించిన పూడూర్ గ్రామానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు గోపాల్ యాదవ్‌ను శనివారం మేడ్చల్ సీఐ సత్యనారాయణ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ భారత రాక్‌బాల్ జట్టులో సభ్యుడిగా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి స్వర్ణ పతకం సాధించడం అభినందనీయమన్నారు. గోపాల్ యాదవ్ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లక్ష్మణ్ యాదవ్, సల్మాన్, ఆనంద్, కిరణ్ తదితరులు పాల్గొని గోపాల్ యాదవ్‌ను అభినందించారు.

## ఘనంగా గాయత్రి యజ్ఞం

- శ్రీ ఆంజనేయ దుర్గామాత ఆలయం వద్ద ప్రతి శనివారం గాయత్రీ యజ్ఞం ఉంటుంది
- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి
- వర్షాలు బాగా కురవాలి సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి




✍ జయభేరి, కొండమల్లేపల్లి :

కొండమల్లేపల్లి పట్టణంలోని దుర్గా నగర్ కాలనీలో గల శ్రీ ఆంజనేయస్వామి దుర్గామాత ఆలయంలో శనివారం ఏకకుండి గాయత్రీ యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం నిర్వహించే గాయత్రి యజ్ఞ కార్యక్రమంలో భక్తుల అదిక సంఖ్యలో పాల్గొనాలని, ప్రతి ఒక్కరు సన్మార్గంలో పయనించాలని సూచించారు. వర్షాలు బాగా కురిసి రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆశించారు. యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అఖిల విశ్వ గాయత్రీ పరివార్ కొండమల్లేపల్లి వారు దుర్గామాత అమ్మవారికి సమర్పించిన చీరను డ్రా ద్వారా అందించారు. డ్రాలో పట్టణానికి చెందిన మంజుల అమ్మవారి చీరను దక్కించుకున్నారు. స్థానిక సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి చేతుల మీదుగా చీరను అందజేశారు. అనంతరం యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీను,గాయత్రి పరివార్ సభ్యులు వింజమూరు చంద్రమౌళి, దాచేపల్లి వెంకటేశ్వర్లు, ఏరుకొండ రాము, నడ్డి శంకర్, నరసింహ, పరశురాం, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.



## SIR ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



✍ జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో జరుగుతున్న SIR కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఉలుపాల శేఖర్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలోని అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ వివరాలను పరిశీలించి, అవసరమైన దరఖాస్తులను సమర్పించాలని గ్రామ ప్రజలకు కోరారు. ఓటరు జాబితాలో కొత్త పేర్లు నమోదు చేయడం పేర్లు సవరించడం,చిరునామా మార్పులు,ఇతర అవసరమైన మార్పుల కోసం సంబంధిత బూత్ లెవల్ అధికారి (BLO) లేదా ఎన్నికల అధికారులను సంప్రదించి నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్,సిమర్ల పర్వతాలు,బిఆర్ఎస్ పార్టీ BLA సిమర్ల శ్రీను యాదవ్,GPO యాదయ్య,బి.యల్.ఓ అంజమ్మ, గ్రామ ప్రజలు సిమర్ల శంకర్, వలమోని వెంకటయ్య,దాసరి వెంకటయ్య,ఐతమోని బిక్షం,బెక్కం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీఎస్ఐ వార్షిక విశిష్ట పురస్కారాలు


- 19 విభాగాల్లో 75 మందికి అవార్డులు..
- యువత ఆలోచనలే రేపటి ఆవిష్కరణలకు పునాది:- ప్రొఫెసర్ గోవర్ధన్
- జాతీయ స్థాయి ప్రతిభకు మా కళాశాల వేదిక కావడం ఆనందదాయకం: త్రిశూల్ రెడ్డి

✍ జయభేరి, మేడ్చల్:

గుండ్లపోచంపల్లి డివిజన్ పరిదిలోని మైసమ్మగూడా నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వేదికగా కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (CSI) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో వార్షిక ప్రతిభ పురస్కారాలు-2026 ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్ సీనియర్ ప్రొఫెసర్, డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ వి. కామాక్షి ప్రసాద్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ ఏడాది 19 విభాగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన 75 మందికి CSI హైదరాబాద్ చాప్టర్ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ మాట్లాడుతూ సాంకేతికత సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే శక్తివంతమైన సాధనమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. టెక్నాలజీని వ్యవసాయం, వైద్యం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో వినియోగించే దిశగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రొఫెసర్ వి. కామాక్షి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు ఆలోచనా శక్తి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. విద్యాసంస్థలు-పరిశ్రమల మధ్య అనుసంధానం పెరిగితే ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు.

అలాగే CSI హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డా. ఏ.వి. కృష్ణ ప్రసాద్ వార్షిక నివేదికను సమర్పించారు. అనంతరం 'AI & డిజిటల్ టెక్నాలజీస్‌తో కోర్ ఇంజినీరింగ్‌ను పునర్నిర్మించడం అంశంపై నిర్వహించిన ప్యానెల్ చర్చలో డా. ఏ.వి.ఎస్.ఎస్. కుమారస్వామి గుప్తా, అన్నవరుఘుల రామకృష్ణ, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ బి. ఉమాశంకర్, సారో ఇన్‌క్ (అమెరికా) ఉపాధ్యక్షుడు జి.కె. చైతన్య పాల్గొన్నారు. కోర్ ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా ఏఐ, డిజిటల్ టెక్నాలజీల్లో నైపుణ్యం సాధించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో CSI ఇండియా ప్రతినిధి కంచిభొట్ల రాజు, ఇమ్మీడియట్ పాస్ట్ చైర్మన్ సి. సుధాకర్, వైస్ చైర్మన్ డా. ఏ. రామకృష్ణ ప్రసాద్, కార్యదర్శి డా. డి.వి. రమణ, కళాశాల చైర్మన్ జె. నర్సింహారెడ్డి, కోశాధికారి జె. త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా. ఏ. మోహన్, కార్యక్రమ సమన్వయకర్త డా. పి. దిలీప్ కుమార్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





**జాతీయ స్థాయి ప్రతిభకు మా కళాశాల వేదిక కావడం ఆనందదాయకం: త్రిశూల్ రెడ్డి**

కళాశాల కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ తమ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వేదికగా CSI హైదరాబాద్ చాప్టర్ వార్షిక విశిష్ట పురస్కారాల కార్యక్రమం నిర్వహించడం ఎంతో గర్వకారణమని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థ CSI తమ కళాశాలను ఈ కార్యక్రమానికి వేదికగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుల్లో తమ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కూడా ప్రతిభ చాటుకుని పురస్కారాలు అందుకోవడం సంస్థకు మరింత గౌరవాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కళాశాలలో అత్యాధునిక ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, పరిశ్రమలతో భాగస్వామ్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, స్టార్టప్‌లు, హ్యాకాథాన్‌లు, జాతీయ-అంతర్జాతీయ సాంకేతిక పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. కృత్రిమ మేధ (AI), డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ టెక్నాలజీల వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు సామాజిక బాధ్యత కలిగిన ఇంజినీర్లను తయారు చేయడమే తమ కళాశాల లక్ష్యమని చెప్పారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో CSI హైదరాబాద్ చాప్టర్ చేస్తున్న సేవలు అభినందనీయమని, భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలకు తమ కళాశాల పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

## కుటుంబ నియంత్రణతోనే ఆరోగ్యకర సమాజం

- ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. కె. ఆనంద్

✍ జయభేరి, మేడ్చల్ :



గర్భధారణల మధ్య సరైన వ్యవధి పాటించడం ద్వారా తల్లి-శిశు ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం-2026 సందర్భంగా అంతాయిపల్లిలోని సమీకృత మేడ్చల్ జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రణాళికాబద్ధమైన కుటుంబ వ్యవస్థతో కుటుంబాల ఆరోగ్యం, ఆర్థిక స్థితి, సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జూలై 11 నుంచి 18 వరకు "ఆరోగ్యకరమైన మాతా-శిశు సంక్షేమం కోసం గర్భధారణల మధ్య సరైన వ్యవధి, అనాలోచిత గర్భధారణల నివారణ" అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల మధ్య సరైన అంతరం ఉండేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పెరుగుతున్న జనాభాతో ఆహారం, తాగునీరు, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక వనరులపై ఒత్తిడి పెరుగుతోందని, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక సాధనాల వినియోగంపై ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ఆరోగ్య విద్యా కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ సేవల ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన వైద్యశాఖ ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఒక్క ఆడపిల్లతో కుటుంబ నియంత్రణ చేయించుకున్న దంపతులకు రూ.1,000 నగదు ప్రోత్సాహకాన్ని అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యాధికారులు డా. లావణ్య, డా. గీత, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డా. శ్రీదేవి, డా. నాగరాజు, డా. పవన్ రెడ్డి, డా. కౌశిక్, డెమో వసంతరెడ్డి, ఉషారాణి, విజయ్‌కుమార్, జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే సర్పంచుల లక్ష్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- గ్రామం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది
- ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలి
- ఎల్ నినో ప్రభావంతో రైతులు తక్కువ నీటితో సాగు చేసే పంటలపై దృష్టి పెట్టాలి
- సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధతో గ్రామాలను ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలి



✍ జయభేరి, పరకాల, జులై 11:

పరకాల నియోజకవర్గం గీసుగొండ మండలం గంగాదేవిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జి పి డి పి ) సర్పంచులు,పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద, సంబంధిత అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ సర్పంచులు గ్రామ ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని అన్నారు. ప్రజా ప్రతినిధిగా లభించిన అవకాశాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించడం ప్రతి సర్పంచ్ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల విశ్వాసం, మన్ననలు పొందడమే ప్రతి సర్పంచ్ లక్ష్యంగా ఉండాలని సూచించారు. గంగాదేవిపల్లి మాజీ సర్పంచ్ దివంగత కూసం రాజమౌళిని ఆదర్శంగా తీసుకుని సేవాభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించి, ప్రజలకు అత్యవసరమైన అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య, పచ్చదనం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులకు అవగాహన కల్పించి, తక్కువ నీటితో సాగు చేసే పంటలు, వర్షాభావాన్ని తట్టుకునే పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేసి గ్రామ ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. "గ్రామం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ జలసిరి ప్రతిజ్ఞ నిర్వహించారు.



## ఎమ్మెల్యే కాలే యాదయ్యను తరిమికొట్టిన స్థానికులు

✍ జయభేరి, షాబాద్ :

షాబాద్ ఆరు హత్యల ఘటన నేపథ్యంలో మృతుల కుటుంబ సభ్యులు.. స్థానికులు అందోలనకు దిగారు.
పోలీసులపై చర్యలు తీసుకోవాలని.. నిందితుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బాధితులు దర్నా చేపట్టారు.
ధర్నా స్థలికి వెళ్ళిన ఎమ్మెల్యే కాలే యాదయ్య పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎందుకొచ్చవంటూ నిలదీసే ప్రయత్నం చేసారు.
మూకుమ్మడిగా ఎమ్మెల్యే మీదకు దూసుకు వచ్చారు.
ఎమ్మెల్యేని అక్కడినుండి తరిమేసిన పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యేకు రక్షణగా నిలిచిన పోలీసులు ఆయనను సురక్షితంగా బయటకు పంపించారు.







## కొత్తగా అర్హులైన వారి ఓట్లను చేర్చాలి

✍ జయభేరి, సైదాపూర్ :

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్ SIR ప్రక్రియలో భాగంగా అమ్మనగుర్తి గ్రామంలో పర్యవేక్షించడం జరిగినది. అర్హులైన ఓట్లను ఎట్టి పరిస్థితుల్లో తొలగించవద్దని అలాగే కొత్తగా అర్హులైన వారి ఓట్లను చేర్చాలని తెలియచేసినారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్, మాజీ సర్పంచ్, యూత్ నాయకులు, కార్యకర్తలు చాడ కొండల్ రెడ్డిని ఘనంగా సన్మానించడం జరిగింది.. తర్వాత పల్లె ప్రగతిలో భాగంగా చెట్టు నాటిన మండల అధ్యక్షులు చాడ కొండల్ రెడ్డి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లెని రవీందర్ రావు, మండల SC సెల్ అధ్యక్షులు లంకదాసరి మల్లయ్య, గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలు శ్రీనివాస్, పూదరి బుచ్చయ్య, పూదరి తిరుపతి, బుర్ర శీను, మాజీ సర్పంచ్ పూదరి ప్రభాకర్, గ్రామ శాఖ యూత్ నాయకులు కదిరే సురేష్, రాజకుమార్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా యొక్క క్లైంట్ పట్లోళ్ల వెంకట రమణా రెడ్డి, S/o. పట్లోళ్ల విట్టల్ రెడ్డి, నివాసం ఇంటి నెంబర్ 8-2-293/82/A/1057/1, రోడ్ నెంబర్ 52, బంజారాహిల్స్, హైదరాబాద్ వాస్తవ్యుడు రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్ మండలం, కంసాన్ పల్లి గ్రామం, నాగూర్లగడ్డ తాండాకు చెందిన ఆంగోతు గణేష్ S/o. ఆంగోతు బాలు దగ్గర సర్వే నెంబర్లు 164/EAA/A, 170/AA/7/AA, 179/A/2/A, 181/RU/1, 185/U/1, 182/U/2, 182/1, 185/0/1, 185/LU/A, 186/EE, 186/UU, విస్తీర్ణాలు 00-08, 00-0350, 00-08, 00-02, 00-2750, 00-2550, 00-02, 00-18, 00-1250, 00-05, 00-20 మొత్తం విస్తీర్ణం ఎ 3-12 గుంటల పట్టా భూమిని అగ్రిమెంట్ ఆఫ్ సేల్ ద్వారా కొనుగోలు చేయడం జరిగినది. ఈ విషయాన్ని మరుగున పరిచి ఈ ఆంగోతు గణేష్ అనే వ్యక్తి పైన తెలిపిన వ్యవసాయ భూములను ఇతరులకు అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నాడని నా క్లైంటుకు రూడీగా తెలిసినది. అయితే పైన తెలిపిన భూములపై ఆంగోతు గణేష్ పైన షాద్నగర్ పట్టణంలోని 16వ అదనపు జిల్లా కోర్టులో పైన తెలిపిన భూములపై సివిల్ దావా వేయడం జరిగినది. అట్టి దావా నెంబర్ O.S. No. 220 of 2025, ఇది ఇప్పటికీ పెండింగ్ లో ఉన్నది. కావున పైన తెలిపిన వ్యవసాయ భూములపై ఎలాంటి అమ్మకాలు, కొనగోలు జరిపిన నా క్లైంట్ తీసుకునే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని ఈ పత్రిక ద్వారా నా క్లైంట్ తరపున బహిరంగంగా తెలియపరచనైనది.

**సం/- పాతపల్లి సురేందర్ రెడ్డి,** న్యాయవాది
షాద్నగర్. Cell : 9948698778.

# సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి రూ 25 కోట్లు మంజూరు

- గజ్వేల్ అభివృద్ధిపై.. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
- ప్రజా పాలనలోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యం
- నియోజకవర్గానికి 6వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు
- యంగ్ ఇండియా, తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరి
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**జయభేరి, గజ్వేల్ /వర్గల్, జులై 11 :**

గజ్వేల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తుండగా, ప్రజా పాలనలోనే పేదల అభివృద్ధి సాధ్యపడుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు. శనివారం మల్లారెడ్డి పల్లిలో సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరితో కలిసి సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి రూ 25 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ గజ్వేల్ కు రూ 200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సీఎం రేవంత్ రెడ్డి కేటాయించిన ట్లు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీయట్ లో మధ్యాహ్న భోజనంతో పాటు పిల్లలకు ఉదయం అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకోగా, నిరుపేద విద్యార్థులకు మంచి చదువు, నాణ్యమైన భోజనం అందించి భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుండగా, గజ్వేల్ కు రెండు విడతల్లో 6 వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రూ రెండు లక్షల పంట రుణమాఫీ చేయగా, పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయడంతో పాటు రైతు భరోసా పథకం కింద రూ 12 వేలు ఖాతాలలో జమ చేసినట్లు స్పష్టం చేశారు. మధ్య దళారీలకు అవకాశం లేకుండా ప్రత్యేక యాప్ ద్వారా ఎరువులు కేటాయిస్తుండగా, సన్నధాన్యానికి రూ 500 బోనస్ ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని చెప్పారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే క్రమంలో రూ 10 లక్షలు రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు సిఎంఆర్ఎఫ్ తో రోగులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుండగా, నిరుద్యోగుల కోసం ప్రతి నియోజకవర్గానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తూ విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి నిరుపేద కుటుంబాలకు మేలు చేస్తుండగా, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్ రెడ్డి వర్తింపజేస్తున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు అశోక్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్లు, నేతలు చెన్నయ్య, గోరేమియా, గోపాల్ రెడ్డి, కుమార్, మహేందర్ గౌడ్, అంజిరెడ్డి, పొన్నాల నర్సారెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో సోదా రామకృష్ణ

**జయభేరి, పరకాల, జులై 11:**

పరకాల పట్టణంలోని హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతి స్థాపన మహోత్సవ కార్యక్రమం బ్రహ్మశ్రీ పాలకుర్తి గౌతమశర్మ, ఆలయ ధర్మకర్త ప్రముఖ వైద్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ గార్ల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభం కాగా మొదటి రోజు కార్యక్రమంలో పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ. ఈ కార్యక్రమంలో రామకృష్ణ తో పాటుగా కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, నాయకులు బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

## పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలో బస్ స్టాప్ నిర్మాణానికి ముందుకోచ్చిన లారస్ ల్యాబ్స్

- ఎన్నో ఏళ్ళ వినతలకు నేడు లారస్ ల్యాబ్స్ కంపెనీతో పరిష్కారం
- స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల చొరవతో అంగీకరించిన కంపెనీ యాజమాన్యం



**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రం అయ్యిన పరవాడ సబ్ స్టేషన్ కూడలిలో ఎన్నో ఏళ్ల నుంచి గత ప్రభుత్వలకి, రాజకీయ నాయుకులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి అలసి ఉన్నా ప్రజానీకానికి కూటమి ప్రభుత్వం సమస్య పరిస్కారం చూపుతూ స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చొరవతో ఫార్మా సిటీ లారస్ ల్యాబ్స్ సంస్థ యాజమాన్యం తమ సిఎస్ఆర్ నిధులుతో సబ్ స్టేషన్ కూడలిలో ప్రయాణికుల అవసరాలు నిమిత్తం బస్ స్టాప్ నిర్మాణం కొరకు ముందుకు రావడం చాలా అభినందించిన విషయం అని స్థానిక ప్రజానీకం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కూటమి నాయుకులతో కలిసి లారాస్ ల్యాబ్స్ కంపెనీ ప్రతినిధులు స్థలం పరిశీలిన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే బస్ స్టాప్ పనులు ప్రారంభిస్తాం అని తెలిపారు. ఈ స్థల పరిశీలనలో కార్యక్రమంలో లారస్ ల్యాబ్స్ ప్రాజెక్ట్ విభాగం ప్రతినిధి బ్రహ్మం, జనసేన జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు గ్రామ కూటమి నాయకులు కూండ్రపు సోమనాయుడు, బొద్దపు అయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం

- యాదగిరిగుట్ట ట్రస్ట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, యాదగిరిగుట్ట :**

యాదగిరిగుట్ట ట్రస్ట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ట్రస్ట్ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులతో ట్రస్ట్ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం తన మిత్రుడు యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యులు మల్లయ్యని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే

- మంజూరైన అభివృద్ధి పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

కుషాయిగూడ వార్డు 16 పరిధిలో రూ. 2.30 కోట్ల (రెండు కోట్ల ముప్పై లక్షలు) వ్యయంతో మంజూరు చేసిన బీటీ రోడ్ల బలోపేతం, దెబ్బతిన్న రోడ్ల రీకార్పెటింగ్ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మారుతి ఎన్‌క్లేవ్‌లోని రోడ్డు నంబర్ 1 నుండి రోడ్డు నంబర్ 13 వరకు, జీహెచ్ఎంసీ ఫ్రీడమ్ పార్క్ నుంచి పోచమ్మ దేవాలయం వరకు, అలాగే వైష్ణవి ఎన్‌క్లేవ్ అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులపై స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే చర్చించారు. రోడ్ల పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకొని, పనులు నాణ్యతతో, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా రాకపోకలు సులభతరం చేయడమే ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, దప్పు గిరి బాబు, బొడిగే రాజు, కడియాల బాబు, కొల నరేష్, వేణుగోపాల్ రెడ్డి, జైకృష్ణ, సంపత్, శేఖర్, బాలాజీ, కోటి రెడ్డి, సుభాష్, రెడ్డి నాయక్ కాలనీ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, కాలనీ వాసులు నవీన్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి శివ శంకేర్ గౌడ్, సంతోష్ రెడ్డి, నాగార్జున, జై పాల్ రెడ్డి, రాజేశ్వర్ గుప్త, వీరాబద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆరోగ్య సేవల విస్తరణ

- సైనిక్‌పురి ఎమ్మెల్యే నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్ఓ డా. ఆనంద్



**జయభేరి, కాప్రా :**

సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని నూతన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (DMHO) డా. ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ ఆరోగ్య సేవల విస్తరణ, ఉప్పల్ నియోజకవర్గంలో వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజారోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన డా. ఆనంద్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన విజయవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.



## పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్థూపం ముందు పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్స్, ఫీజు రీఎంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను తక్షణమే విడుదల చేయాలి ప్రభుత్వము అనేక కార్యక్రమాలకు బడ్జెట్ను విడుదల చేస్తుంది కానీ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచన చేయకుండా విద్యార్థులు స్కాలర్షిప్ల కోసం రోడ్లకే దుస్థితి తీసుకొచ్చిందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ను విడుదల చేయకపోతే, పాత విధానంలో ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయక పోతే జాతీయ రహదారులను దిబ్బంధం చేసి, ప్రభుత్వ పాలన స్తంభింపచేస్తామని అన్నారు. 14వ తారీకు ఇందిరా పార్క్ వద్ద జరగబోయే సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని, అన్ని నియోజకవర్గాల్లో విద్యార్థులతో భారీ ర్యాలీలు తీసి ప్రభుత్వానికి నిరసన తెలియపరచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ భాషా నాయక్, పున్న వెంకటేష్ నేత, ముష్టి వీరయ్య, కానుగుల. చంద్రశేఖర్, పున్న బిక్షమయ్య, సొల్లేటి భాస్కరాచారి, కాటం, వెంకటేష్, అశ్విని కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గర్భిణీ స్త్రీకి గర్భధారణ విరామం అవసరం




**జయభేరి, పరవాడ:**

ప్రపంచ జనాభా దినోత్సవం పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ మరియు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ ప్రతివారు కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కలిగి ఉండాలని బిడ్డకు బిడ్డకు మధ్య మూడు సంవత్సరాల విరామం కలిగి ఉండాలని ఈ గర్భధారణ విరామము వలన తల్లికి రక్తహీనత తగ్గుతుందని శరీరం పూర్తిగా కోలుకుంటుంది అని అన్నారు. మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పుట్టబోయే బిడ్డ తక్కువ బరువుతో పుట్టే ప్రమాదం తగ్గుతుందని శిశువు ఎదుగుదల బాగుంటుందని అన్నారు. కుటుంబం ఆర్థిక పరిస్థితి మెరుగుపడి ఆరోగ్యంగా ఆనందంగా ఉంటారని అన్నారు. కుటుంబ నియంత్రణకు కాండోమ్స్, గర్భనిరోధక మాత్రలు కాపర్ టీ (ఐ.యు.డి) మొదలగు తాత్కాలిక పద్ధతులు, పురుషులకు వ్యాసకట్టమి, స్త్రీలకు ట్యూబక్టమీ శాశ్వత పద్ధతులు పాటించవలెను అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎమ్.ఎస్.ఎస్ సాయిరాం. పీ.హెచ్.ఎన్. జానకి రామన్, హెల్త్ సూపర్వైజర్ ఎమ్.ఎస్.ప్రసాద్ కుమార్, హెల్త్ అసిస్టెంట్లు పి.రాజు, ఎమ్. శ్రీనివాస్, ఫార్మసిస్ట్ విజయకుమారి, ఎల్.టి అన్నపూర్ణేశ్వరి ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్లపై పోలీసులు ఆకస్మికంగా దాడులు

**జయభేరి, పరవాడ :**

పరవాడ మండలం బర్నికం గ్రామం శివారులో శనివారం మధ్యాహ్నం పరవాడ మండలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లంక భాస్కరరావుకి అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా, తన సిబ్బందితో కలిసి బర్నికం శివారులో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లపై ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో 5 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు అక్కడి నుంచి పరారయ్యారు. పరారీలో ఉన్న ఇద్దరిపై కూడా కేసు నమోదు చేసాం అని పోలీస్ శాఖ అధికారులు తెలిపారు. పట్టుబడ్డ నిందితుల వద్ద నుంచి రూ.4,270 నగదు, 3 సెల్‌ఫోన్లు, 4 మోటార్‌సైకిళ్లు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకొనట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

## బీసీలే రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ఉద్యమించాలి

- టిఆర్పి పార్టీ జిల్లా అధ్యక్షుడు తుప్పతి బిక్షపతి



**జయభేరి, గజ్వేల్, జులై 11 :**

రాష్ట్రంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అగ్రవర్ణాల ఆధిపత్య పాలన కొనసాగుతోందని, ఇక ఆ పరిస్థితికి ముగింపు పలికి బీసీలే రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు తుప్పతి బిక్షపతి పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టిఆర్పి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు (ఎమ్మెల్సీ) తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో నిర్వహించిన మహాసభ విజయవంతం కావడం బీసీ చైతన్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల ఐక్యత మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీలో సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కులాలకు అతీతంగా బీసీ రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తెలంగాణ రాజ్యాధికార పార్టీకి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా, మండల, యువజన, రైతు విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందుకే అందంగా కనిపిస్తోంది..



సినీరంగంలో హీరోహీరోయిన్స్ తమ లుక్స్, ఫిట్నెస్ పై ఎంతో శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా సీనియర్ తారలు ఇప్పుడు వర్కవుట్స్ పై ఫోకస్ పెట్టారు. ఇదిలా ఉంటే.. సినిమా ఇండస్ట్రీలో మోస్ట్ గ్లామరస్ అండ్ ఫ్లాలెస్ స్కిన్ ఉన్న హీరోయిన్లలో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ఒకరు. తెలుగులో ఈ అమ్మడుకు ఉన్న క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. నార్త్ నుంచి సౌత్ వరకు దాదాపు అందరు అగ్ర హీరోల సరసన నటించిన ఈ ముద్దుగుమ్మ... ఇప్పుడు ఓటీటీల్లో ఎక్కువగా వెబ్ సిరీస్ చేస్తుంది. అంతేకాకుండా అటు యాడ్స్ ద్వారా బిజీగా ఉంటుంది. అయితే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి దశాబ్దాలు దాటిన ఈ అమ్మడు అందం ఏమాత్రం తగ్గడం లేదు. ఇప్పటికీ కుర్ర భామలకు పోటీగా ఫిట్నెస్, లుక్స్ మెయింటైన్ చేస్తుది. అయితే ఈ అమ్మడు అందం వెనుక ఉన్న రహస్యం ఏంటా అని అభిమానులు ఎప్పుడూ ఆరా తీస్తూనే ఉంటారు. అయితే తాజాగా తమన్నా తన స్కిన్ కేర్ రొటీన్‌కు సంబంధించి రివీల్ చేసిన ఒక ఇంట్రెస్టింగ్ అండ్ షాకింగ్ న్యూస్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ముఖంపై వచ్చే పింపుల్స్ (మొటిమలు), మచ్చలను తగ్గించుకోవడానికి తమన్నా ఎవరూ ఊహించని ఒక వింత చిట్కాను పాటిస్తుందట. అదేంటంటే.. ఆమె తన ముఖ రక్షణ కోసం సొంత లాలాజలాన్ని (Saliva) ఫేస్‌పై అప్లై చేస్తుందట! వినడానికి కొంచెం వింతగా ఉన్నా ఇది నిజం. సహజంగా ఉదయాన్నే నిద్ర లేవగానే నోట్లో ఉండే లాలాజలంలో ఎన్నో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయని నమ్ముతారు. ముఖంపై మొటిమలు ప్రారంభ దశలో ఉన్నప్పుడు, రాత్రి పడుకునే ముందు లేదా ఉదయాన్నే లాలాజలాన్ని ఆ పింపుల్స్‌పై రాస్తే అవి త్వరగా తగ్గిపోతాయని కొందరి అభిప్రాయం. ఇప్పుడు తమన్నా కూడా ఇదే ప్రాచీన, సహజసిద్ధమైన పద్ధతిని ఫాలో అవుతూ తన చర్మాన్ని మొటిమల బారి నుంచి కాపాడుకుంటున్నట్లు సమాచారం.




## ఓటీటీల్లో సంచలనం సృష్టిస్తున్న మైథలాజికల్ డార్క్ థ్రిల్లర్ 'త్రికాల'

తెలుగు సినీ పరిశ్రమలో విభిన్నమైన మైథలాజికల్ డార్క్ థ్రిల్లర్‌గా రూపొందిన 'త్రికాల' సినిమా థియేటర్లలో మంచి స్పందన అందుకుని, ఇప్పుడు ఓటీటీ వేదికలపై సైతం సంచలనం సృష్టిస్తోంది. 'A Script of God' అనే ఆసక్తికరమైన సబ్‌టైటిల్‌తో వచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం జియో హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్, సన్‌నెక్ట్స్ వంటి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ అవుతూ టాప్ రేటింగ్‌తో ట్రెండ్ అవుతోంది. ప్రముఖ రేటింగ్ సంస్థ ఐఎండీబీ (IMDb)లోనూ ఈ చిత్రం ఏకంగా 9.1 రేటింగ్ అందుకుని చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా నిలిచింది. శ్రద్ధా దాస్, మహేంద్రన్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని దర్శకుడు మణి తెల్లగూటి అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా కేవలం డైలాగులకే పరిమితం కాకుండా కర్మ సిద్ధాంతం, గో సంరక్షణ అవసరాన్ని మరియు పునర్జన్మల వైవిధ్యాన్ని విజువల్‌గా ఆవిష్కరించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. పౌరాణికతను ఆధునిక ప్రపంచంతో మేళవిస్తూ మైథాలజీ, సైకాలజికల్ హారర్, డార్క్ ఫాంటసీ అంశాలను సమన్వయం చేసిన దర్శకుడు మణి తెల్లగూటి ఈ సినిమాను ఒక విజువల్ వండర్‌గా మలిచారు. స్క్రిప్ట్ దశ నుంచే ప్రతి ఫ్రేమ్‌ను విజువల్‌గా డిజైన్ చేయడం ఆయన టెక్నికల్ నైపుణ్యాన్ని చాటుతోంది. ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లడంలో పవన్ చెన్న అందించిన డార్క్ విజువల్స్, షాజీద్ హ్యూమాయన్ అందించిన మైండ్ బ్లోయింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన బలాలుగా నిలిచాయి. వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం అటు థియేటర్లలో, ఇటు ఓటీటీల్లోనూ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ టాలీవుడ్‌లో సరికొత్త చర్చకు దారితీసింది.

## 'జననాయగన్' కానీ విడుదల వాయిదా!





కోలీవుడ్ స్టార్, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'జననాయగన్' ఎట్టకేలకు సెన్సార్ ఫార్మాలిటీస్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ నిరీక్షణ, పలు న్యాయపోరాటాల అనంతరం ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు (CBFC) 'A' (అడల్ట్) సర్టిఫికేట్‌ను జారీ చేసింది. హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా చిత్రం మొత్తం 3 గంటల 3 నిమిషాల సుదీర్ఘ రన్‌టైమ్‌తో థియేటర్లలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. తీవ్రమైన రాజకీయ నేపథ్యం ఉన్న కథాంశం కావడంతో, సెన్సార్ బోర్డు సూచనల మేరకు విజయ్ క్యారెక్టర్ పేరు ఆధారంగా వచ్చే 'టీవీకే' (TVK) డైలాగ్స్ రెఫరెన్స్‌లతో పాటు మరికొన్ని వివాదాస్పద సీన్లను మేకర్స్ మార్చడం లేదా మ్యూట్ చేసినట్లు తెలుస్తుంది. ఇక ఈ చిత్రంలో పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజూ కీలక పాత్రలు పోషించారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతాన్ని అందించారు. వీఎన్ ప్రొడక్షన్స్ (KVN Productions) ఈ భారీ చిత్రాన్ని నిర్మించింది. అయితే మొదట ఈ సినిమాను జూలై 24న విడుదల చేయాలని భావించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ విడుదల తేదీ వాయిదా పడింది. త్వరలోనే సరికొత్త అధికారిక విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ స్పష్టం చేసింది.

## చేతులరా హిట్టు పోగొట్టుకున్న హీరోయిన్..

టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని అఖిల్ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సాలిడ్ కమర్షియల్ సక్సెస్ 'లెనిన్' సినిమాతో ఎట్టకేలకు లభించింది. మొదటి ఆట నుంచే ఈ చిత్రానికి ప్రేక్షకుల నుండి భారీ రెస్పాన్స్ వస్తోంది. దశాబ్ద కాలంగా సరైన హిట్ లేక ఇబ్బంది పడుతున్న అఖిల్ కెరీర్‌లోనే ఇది హయ్యెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా నిలిచింది. మొదటి రోజే దాదాపు 16 కోట్ల గ్రాస్ వసూలు చేసి బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర సృష్టిస్తోంది. ఈ సినిమా ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ విజయం సాధించడంతో చిత్ర యూనిట్ అంతా సంబరాల్లో మునిగిపోయింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో మొదట హీరోయిన్‌గా స్టార్ బ్యూటీ శ్రీలీలను అనుకున్నప్పటికీ, కొన్ని అనివార్య కారణాల వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకుంది. దీంతో ఆమె స్థానంలో టాలీవుడ్ లేటెస్ట్ క్రష్, గ్లామరస్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సేను లీడ్ హీరోయిన్‌గా తీసుకున్నారు. అయితే ఈ సినిమా సక్సెస్ వేళ సోషల్ మీడియాలో స్టార్ హీరోయిన్ శ్రీలీలపై విపరీతమైన ట్రోలింగ్ మొదలైంది. గతంలో ఆమెతో కూడిన ఒక గ్లింప్స్ కూడా మేకర్స్ విడుదల చేశారు. అయితే అప్పట్లో ఆ గ్లింప్స్‌లో ఒక సీరియస్ సన్నివేశంలో శ్రీలీల నవ్వుతూ కనిపించిందని నెటిజన్లు పెదవి విరిచారు. ఆ తర్వాత డేట్స్ అడ్జస్ట్‌మెంట్ సమస్యల వల్ల లేదా మరే ఇతర కారణాల వల్ల కానీ శ్రీలీల ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోగా, ఆ స్థానంలోకి టాలీవుడ్ లేటెస్ట్ క్రష్ భాగ్యశ్రీ బోర్సే వచ్చి చేరింది. ఇప్పుడు సినిమాలో భాగ్యశ్రీ బోర్సే 'భారతి' అనే ఎమోషనల్ అండ్ పవర్‌ఫుల్ పాత్రలో అద్భుతంగా నటించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. భాగ్యశ్రీ నటనకు వస్తున్న రెస్పాన్స్ చూసి మీమర్స్, నెటిజన్లు శ్రీలీలను టార్గెట్ చేస్తూ ట్రోల్స్ చేయడం మొదలుపెట్టారు.



## క్వీన్" సినిమాలో కీలక పాత్రలో రమ్యకృష్ణ



### ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్మి ప్రణతి పాత్రలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనున్న రమ్యకృష్ణ

ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ యామినీ ఈఆర్ ను హీరోయిన్ గా పరిచయం చేస్తూ టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రతన్ రిషి హీరోయిన్ సెంట్రిక్ కథతో "క్వీన్" మూవీని రూపొందిస్తున్నారు. ఈ సినిమాను వన్ సర్కిల్ ఫిలింస్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ విలన్స్ గా నటిస్తున్నారు. డైలాగ్ కింగ్ సాయికుమార్ హీరోయిన్ తండ్రి పాత్రను పోషిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా నుంచి ఒక ఇంపార్టెంట్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. "క్వీన్" చిత్రంలో ఒక పవర్ ఫుల్, స్ట్రాంగ్ క్యారెక్టర్ లో ప్రముఖ నటి రమ్యకృష్ణ నటిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్మి ప్రణతి పాత్రలో రమ్యకృష్ణ తన నటనా ప్రతిభతో ప్రేక్షకుల్ని ఆకట్టుకోబోతున్నారు. రమ్యకృష్ణ తమ సినిమా టీమ్ లో జాయిన్ అవుతున్న సందర్భంగా చిత్రబృందం ఆమెకు ఆహ్వానం పలికారు.

"క్వీన్" చిత్రాన్ని వాస్తవ ఘటనల ఆధారంగా, రియల్ క్యారెక్టర్స్ ను స్ఫూర్తిగా తీసుకుని ఫిక్షనల్ స్టోరీతో దర్శకుడు రతన్ రిషి రూపొందిస్తున్నారు. 20062010 మధ్య కాలం నేపథ్యంగా ఈ చిత్ర కథ సాగనుంది. ప్రస్తుత సొసైటీ తో ముడిపడి ఉన్న ఒక ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీని ఈ చిత్రంలో ప్రేక్షకులు చూడబోతున్నారు. "క్వీన్" సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. నటీనటులు యామినీ ఈఆర్, రమ్యకృష్ణ, డైలాగ్ కింగ్ సాయికుమార్, అజయ్ ఘోష్, తనికెళ్ల భరణి, కాళకేయ ప్రభాకర్, నవీన్ బేతిగంటి, తదితరులు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**